## క్లుప్తంగా

### కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్



చెన్నయ్యను పరామర్శిస్తున్న ఆంజనేయులు ముదిరాజ్

**కుల్కచర్ల:** కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. బుధవారం నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన కాకి చెన్నయ్యను పరామర్శించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డితో మాట్లాడించి మెరుగైన వైద్యం అందించేందుకు ఆస్పత్రి వైద్యులకు సూచిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబాదాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ఏఈఓ శ్రీనివాస్



ఎన్కేపల్లిలో రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈఓ శ్రీనివాస్

**మోమిన్‌పేట:** రైతులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో రైతుల రిజిస్ట్రేషన్‌లను ప్రారంభించారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ నంబరు, ఫోన్ నంబరుకు లింక్ చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వలన రైతుల వారిగా ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులను ఎంత వరకు ఉపయోగిస్తున్నారని ప్రభుత్వానికి తెలుస్తుందని ఆయన వివరించారు. ఇప్పటికే ఎరువులు కొనుగోలు చేసినప్పుడు ఆధార్ నంబరును లింక్ చేస్తున్నారని ఇకపై విత్తనాలను కూడా లింక్ చేయనున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అడివిరెడ్డి, కారోబార్ విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### స్వామి వారి సేవలో పరిగి ఎమ్మెల్యే దంపతులు



స్వామివారిని దర్శించుకున్న రామ్మోహన్‌రెడ్డి దంపతులు

**అనంతగిరి:** వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని లక్ష్మి అనంతపద్మనాభ స్వామిని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు అనంతగిరిచార్యులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు.

### పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

**చేవెళ్ల:** చేవెళ్ల డివిజన్ పరిధిలో అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. చేవెళ్లలోని ఎంఈఓ కార్యాలయంలో చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు కొనసాగిస్తూ అధిక మొత్తంలో ఫీజులు దండుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇలాంటి పాఠశాలలు వెలిసి విద్యార్థుల జీవితాలను, తల్లిదండ్రుల ఆశలను ఆవిరి చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రారంభంలోనే విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకపోయినా ప్రచారాలు చేసుకుంటూ పాఠశాలల బోర్డులు పెట్టి అడ్మిషన్లు చేసుకుంటున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి అనుమతులు లేని స్కూళ్లను మూసివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, అశోక్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా స్పీకర్ జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- రక్తదానం చేసిన కార్యకర్తలు, నాయకులు



అనంతగిరి: శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ససగారి కొండల్‌రెడ్డి



అనంతగిరి: కేక్ కట్ చేయిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు



తాండూరు: స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బీఎంఆర్



అనంతగిరి: శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

**అనంతగిరి:** అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం వికారాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో భాగంగా ముందుగా ఆయనకు వేదపండితులు మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించారు. ఉదయం నుంచే స్పీకర్‌కు రాష్ట్ర ముఖ్య నేతలు, మంత్రులు, ఉన్నతాధికారులు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా, నియోజకవర్గం, మున్సిపల్, ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, అధికారులు, మిత్రులు ఇక్కడికి విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఇతర జిల్లా అధికారులు, మండలాల అధికారులు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు కేక్ కట్ చేయించారు. సంబురాలతో క్యాంపు కార్యాలయం కిక్కిరిసిపోయింది.

**మద్గుల్ చిట్టంపల్లిలో..**

స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రజలు మెచ్చిన నాయకుడని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ అన్నారు. మద్గుల్ చిట్టంపల్లిలో నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 36మంది యువకులు రక్తదానం చేశారు. వెంకటయ్యగౌడ్, అనంతరాములు, రమేష్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బీఎంఆర్..**

తాండూరు: శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రసాద్‌కుమార్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ధారూరులో..**

**ధారూరు:** ధారూరు మండల కేంద్రంలో వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాగారం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుకుమార్ రక్తదానం చేశారు. ధారూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్. అశోక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి. రాములు, మహ్మద్ బాబాఖాన్, రమేశ్‌కృష్ణ, బుజ్జయ్యగౌడ్, ఇబ్రహీం, గడిల మల్లారెడ్డి, కల్వకిరణ్, అమరేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధే ధ్యేయం**

**మోమిన్‌పేట:** నియోజక వర్గ అభివృద్ధే ధ్యేయమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిర్వహించి, అనంతరం కేక్ కట్ చేశారు. మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు సుభాష్ గౌడ్, సురేందర్, సిరాజోద్దీన్, నరోత్తంరెడ్డి, మహంత్‌స్వామి, ఎరాజ్, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

# ధారూరులో ఆనంద్ జన్మదిన వేడుకలు



ధారూరు: బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆనంద్ జన్మదిన వేడుకలను జరుపుతున్న నాయకులు



ఆనంద్‌కు కేసీఆర్ చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న అనిల్ తదితరులు

**ధారూరు:** ధారూరు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు శెట్టి శివానందం, రాములు, చంద్రమౌళి, సంతోష్‌కుమార్, రహమతుల్లాఖాన్, హఫీజ్, ఇస్మాయిల్, చిన్నయ్యగౌడ్, ఎ. అంజయ్య, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యేకు కేసీఆర్ చిత్రపటం..**

**బంట్వారం:** మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# డబుల్ ఇళ్లు కేటాయించాలి

**మొయినాబాద్:** అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం లబ్ధిదారులతో కలిసి సీపీఎం నాయకులు డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల క్రితమే డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన అప్పటి ప్రభుత్వం 36 మంది లబ్ధిదారులను సైతం ఎంపిక చేసిందన్నారు. కానీ ఇళ్ల కేటాయించడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక చొరవ తీసుకొని ఇళ్లకు మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. వెంటనే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీ ఎం మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, డప్పు ప్రవీణ్‌కుమార్, ప్రభుదాస్ పాల్గొన్నారు.



మేడిపల్లిలో ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



రెడ్డిపల్లిలో భూమికి సమాంతరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

# ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

**మొయినాబాద్:** గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. భూమికి సమాంతరంగా, కంచె లేకుండా ఇళ్ల మధ్య ఉన్న వాటితో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**కంచె లేకుండా..**

మండల పరిధిలోని మేడిపల్లి, రెడ్డిపల్లి, చందానగర్, కుత్బుద్దీన్‌గూడ, మోత్కుపల్లి, వెంకటాపూర్, శ్రీరాంనగర్, నాగిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని భూమికి సమాంతరంగా ఉండటంతో విద్యుత్ తీగలన్నీ తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతో మనుషులతో పాటు గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని, గతంలో వాటి వద్ద కరెంటు షాక్ తగిలి పశువులు మృత్యువాతపడ్డాయి. అయినా విద్యుత్ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### అందుబాటులో జనుము, జీలుగ విత్తనాలు

**తాండూరు రూరల్:** రైతులకు జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి కొమురయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 కిలోల బస్తా సబ్సిడీతో రూ. 2,137 అందజేస్తారని పేర్కొన్నారు. ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే పంపిణీ చేస్తారని తెలిపారు. అవసరం ఉన్న రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాసు పుస్తకం జీరాక్స్ తీసుకొని వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### కూలిన శ్మశానవాటిక ప్రహరీ



**షాద్‌నగర్:** పట్టణంలోని మినీ స్టేడియం వద్ద ఉన్న శ్మశానవాటిక ప్రహరీ ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. దీంతో అంత్యక్రియలకు వచ్చేవారు అవస్థలు పడుతున్నారు. అంతిమ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత అస్థికలు భద్రపరిచేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన



ప్రధాన చౌరస్తాలో అవగాహన నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

**కుల్కచర్ల:** ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా బోధన చేపడుతున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలలో ఎన్నో సౌకర్యాలు మెరుగుపడి కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధన నిర్వహిస్తున్నారన్నారు. అత్యుత్తమ ప్రతిభగల ఉపాధ్యాయులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రమేశ్, రత్నం, ముత్యప్ప, కృష్ణవేణి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, చౌడాపూర్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అజ్మత్, రాములు, బాలకృష్ణ, బసప్ప, నర్సింలు, శ్రీనివాస్, కృష్ణ, బాలు, యాదగిరి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సహకార సంఘం అండ

- పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య
- అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత



రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య తదితరులు

**కుల్కచర్ల:** సభ్యత్వం ఉన్న రైతులకు సహకార సంఘం అండగా ఉంటుందని పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం సాల్వీడు గ్రామానికి చెందిన పాలెపల్లి అంజిలయ్య ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మొగులయ్య, సీఈఓ బక్కారెడ్డి స్థానిక డైరెక్టర్ కొండయ్య ఆధ్వర్యంలో సహకార సంఘం సభ్యుడు పాలెపల్లి అంజిలయ్య కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం రూ.9వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సహకార సంఘాలు రైతులకు ఆపద సమయంలో ఆదుకుంటున్నాయన్నారు.

# రేషన్ బియ్యానికి తప్పని తిప్పలు



దుద్యాల్ రేషన్ దుకాణంలో బారులు తీరిన జనం



కొడంగల్ రూరల్: రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు

**దుద్యాల్:** మూడు నెలల రేషన్ బియ్యం కోటా కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వరు బిజీతో 6 సార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తుందని చెబుతున్నారు. ఒక్కొక్కరికి రేషన్ ఇవ్వాలంటే దాదాపుగా 30 నిమిషాల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. దీంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని వివరిస్తున్నారు. ఈ విషయంలో ప్రజలు ఇంత ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. సర్వర్ సమస్యను గుర్తించి వేగంగా పని చేసేందుకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**సర్వర్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు**

**కొడంగల్ రూరల్:** రేషన్ దుకాణాల్లో సర్వర్ మొరాయించడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం పట్టణంలోని ఓ రేషన్ దుకాణంలో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు కేవలం ఆరు కార్డులకు మాత్రమే బియ్యం పంపిణీ చేశారు. సర్వర్ మొరాయించడంతో బయోమెట్రిక్‌లో వేలిముద్రలను సరిచూసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు సర్వర్ సహకరించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

శాస్త్రవేత్తలు మహదేవప్ప, రమేశ్



పంటల సాగుపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

**మొయినాబాద్‌రూరల్:** రైతులు విత్తనాల ఎంపికలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మహదేవప్ప, రమేశ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని బాకారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలు వాడినప్పుడే అధిగ దిగుబడి సాధిస్తారన్నారు. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. మెలకువలు పాటించి అధిక దిగుబడి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సునీల్, రైతులు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పసుపు భలే బాగు

- సాగుకు మొగ్గు
- పెరుగుతున్న విస్తీర్ణం
- మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ
- క్వింటాల్‌కు రూ.12వేల వరకు ధర
- అధిక ఆదాయం సమకూరుతుండడంతో రైతన్నల హర్షం



మోమిన్‌పేటలోని మొరంగపల్లిలో పసుపును విత్తుతున్న కూలీలు

**మోమిన్‌పేట:** 10సంవత్సరాలు నన్ను సాగు చేస్తే నాలాంటి వన్నెను నీకు అందజేస్తానని పసుపు చెప్పినట్లు అనే నానుడి. 15 సంవత్సరాల క్రితం నీటి వసతి కలిగిన ప్రతీ రైతు ఎంతో కొంత సాగు చేసేవారు. అప్పుడు ధర క్షీణించడంతో పసుపుకు బదులు ప్రత్యామ్నయ పంటలు వేసుకున్నారు. కాలక్రమేణ సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపుకు డిమాండ్ ఉంది. క్వింటాల్‌కు రూ.12వేలకు పైగానే పలుకుతుండటంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. బెడ్‌పై సాగు చేస్తుండడంతో అధిక దిగుబడులు వస్తున్నట్లు చెబుతున్నారు. పసుపు సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు పాటించాల్సిన నియమాలను ఉద్యాన శాఖాధికారి అక్షితరెడ్డి వివరిస్తున్నారు.



ఉద్యాన శాఖాధికారి అక్షితరెడ్డి

**నేలలు**

నీరు ఇంకే నేలలు పసుపు సాగుకు అనుకూలం. క్షార భూములు, ఇసుక నేలలు అనుకూలం కావు.

**నేల తయారు**

నేలను బాగా లోతుగా దున్నుకోవాలి. చివరి దుక్కిలో 10టన్నుల పశువుల ఎరువు, వేప పిండిని కలిపి బాగా కలియదున్నాలి. అనంతరం ట్రాక్టర్ ద్వారా బెడ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలు కురుస్తుండటంతో పసుపు పంటను విత్తుకోవడం శ్రేష్ఠం. బెడ్‌పై రెండు వరుసలుగా ఏర్పాటు చేసుకోవాలి. విత్తిన వెంటనే భూమిలో తేమను చూసి కలుపు మందు పెండిమిథాలిన్‌తో పిచికారి చేసుకోవాలి.

**వేప పిండితో పాటు యూరియా..**

విత్తుకొనేటప్పుడు విత్తన శుద్ధి తప్పనిసరి. తెగుళ్లసోకే అవకాశం ఎక్కువగా ఉంటాయి కాబట్టి విత్తిన 40రోజులకు వేప పిండితో కలిపి యూరియాను చల్లుకోవాలి. 80నుంచి 120 రోజులకు యూరియాతో పాటు పొటాష్ వేసుకోవాలి.

**నీటి తడులు**

దుంపలు ఊరే సమయంలో, కొమ్ములు సాగే దశలో ఉన్నప్పుడు నీటిని సమృద్ధిగా ఇవ్వాలి. వర్షాలు లేనప్పుడు నీటి తడులను చూసుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తెగుళ్ల సోకే లక్షణాలు కనిపించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా దుంప కుళ్లుతో ఎక్కువ నష్టం చేకూరుతుంది. ఆకుపై మచ్చలు, ఆకుకొనలు ఎండిన, సుడి ఆకును పీకినప్పుడు భూమి మట్టం రావడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలి. దగ్గర్లో ఉండే ఉద్యాన శాఖాధికారులను సంప్రదించి తగిన సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు తీసుకోవాలి. పంటకు కావలసిన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ నిరంతరం శ్రమిస్తే పసుపు పంటను ఆదాయ వనరుగా మలుచుకోవచ్చని అక్షితరెడ్డి పేర్కొన్నారు. బెడ్‌పై సాగు చేస్తే ఎకరాకు సుమారు 40క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని ఆమె తెలిపారు.